ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 13 ఆగస్టు 2024 | 5



రేపటి నుంచి వాడపల్లి వెంకన్న పవిత్రోత్సవాలు
తిరుమల తరహాలో మూడు రోజుల పాటు నిర్వహణ
ప్రత్యేక పూజలు, అభిషేకాలు
7లో

ఇకపై ఘనంగా..

నిధుల వినియోగంలో 'స్వాతంత్ర్యం'
స్వాతంత్ర్య, గణతంత్ర వేడుకలకు నిధులు కేటాయింపు
హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న సర్పంచులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య వేడుకలను గ్రామీణ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల్లో స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు నిధులు విడుదలకు సంబంధించి ప్రభుత్వం శుభవార్త తెలిపింది. పంచాయతీలు చేసే ఖర్చుపై కనీస పరిమితి రూ.10 వేలకు పెంచింది. మైనర్ పంచాయతీలకు రూ.10 వేలు, మేజర్ పంచాయతీలకు రూ.25 వేలు నిర్దేశించింది. జనాభా లెక్కల ప్రకారం 5 వేలు జనాభా కలిగిన పంచాయతీల్లో రూ.25 వేలు, 5 వేల కంటే జనాభా ఎక్కువున్న పంచాయతీల్లో అదనంగా ఖర్చు చేసే వెసులుబాటు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9న ఉత్తర్వులు జారీ చేసింది. గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను పక్కనపెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా జరపాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పంచాయతీల్లో స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవాలకు సంబంధించి ఖర్చుల పరిమితిని పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల సర్పంచ్‌లు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌లకు పంచాయతీల సర్పంచ్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ మహేష్‌కుమార్



అమలాపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీ అధికారులతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. పారిశుధ్య నిర్వహణ, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించి ఎటువంటి అంటు వ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణశాఖ సూచనల మేరకు ఈ నెల 13, 14 తేదీల్లో వర్షాలు పడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. 15వ ఆర్థికసంఘం నిధులు వినియోగంపై సమీక్షించారు. పారిశుధ్య వ్యవస్థకు సంబంధించిన పది పారామీటర్లను సమర్థవంతంగా అమలు చేయడానికి పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు జి.కేశవర్ధనరెడ్డి, ఎస్.సుధాసాగర్, జేవీవీ సత్యనారాయణ, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, ఆగస్టు 12: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లుతో కలిసి కలెక్టర్ 181 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వీకరించిన ఫిర్యాదులను నిశితంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా కేంద్రం వరకు అర్జీదారులు రావాల్సిన అవసరం లేకుండా అధికారులు మండల స్థాయిలోని అర్జీలకు పరిష్కారం చూపించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, సచివాలయ నోడల్ అధికారి భీమేశ్వరరావు, జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ, ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీరాణి, జిల్లా వ్యవసాయాధికారి ఓలేటి బోసుబాబు, వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ పాల్గొన్నారు.

25 అర్జీల స్వీకరణ



అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ

అమలాపురం టౌన్, ఆగస్టు 12: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చినవారు వివిధ సమస్యలపై 25 అర్జీలను అందజేశారు. వాటిలో ప్రధానంగా భూతగాదాలు, కుటుంబ కలహాలు, ఇతర సమస్యలు ఉన్నాయి. చట్టానికి లోబడి సమస్యలను పరిష్కరించాలని ఆయా స్టేషన్ల పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు.

చౌక డిపోల వ్యవస్థ మరింత పటిష్టం

త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల డిపోల ఏర్పాటు
పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
రైతులకు రూ.192 కోట్ల మేర ధాన్యం బకాయిల విడుదల



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

అమలాపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చౌక డిపోల వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. పేద ప్రజలకు బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరుకులను సులభతరంగా పంపిణీ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలోని కలెక్టరేట్‌లో రబీ సీజన్‌కు సంబంధించిన బకాయిలను సోమవారం ఆయన పంపిణీ చేశారు. తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల పరిధిలోని 10,450 మంది రైతులకు చెల్లించాల్సిన రూ.191.84 కోట్ల చెక్కును రైతులకు అందజేశారు. కోనసీమ జిల్లాకు సంబంధించి 8829 మంది రైతులకు రావాల్సిన రూ.154.63 కోట్లు విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం మంత్రి మనోహర్ మాట్లాడుతూ రైతులకు భరోసా కల్పించే లక్ష్యంతోనే తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకువస్తుందని పేర్కొన్నారు. ధాన్యానికి కనీస మద్దతు ధర రూ.2,350గా నిర్దేశించినట్టు చెప్పారు. జిల్లాలో 80 శాతం మంది కౌలు రైతులు సాగులో ఉన్నారని, 2012 నాటి కౌలు చట్టాన్ని బలోపేతం చేసేందుకు త్వరలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి కౌలు రైతులను గుర్తించి వారి సంక్షేమానికి కృషి చేస్తామని చెప్పారు. రైతులకు వ్యవసాయ పనుల నిమిత్తం 50 శాతం రాయితీపై వివిధ పరికరాలు అందిస్తున్నామన్నారు. జిల్లాలో 1312 కిలోమీటర్ల కాల్వల్లో పూడికతీత పనులకు ప్రభుత్వంతో సంప్రదించి చర్యలు చేపడుతున్నట్టు మంత్రి చెప్పారు. ఇంకా ధాన్యం రవాణా, ఇతర చార్జీలకు సంబంధించి రూ.33 కోట్లు బకాయి ఉందని, వాటిని విడుదలచేసి రైతులకు అందిస్తామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం కొనుగోలు చేసిన 10 వేల వాహనాల వల్ల వినియోగదారులకు కలిగే సౌకర్యం నామమాత్రమేనని మంత్రి పేర్కొన్నారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 95 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ధాన్యం సొమ్ములు సుమారుగా రూ.355 కోట్లు కాగా తొలివిడతలో రూ.84 కోట్లు, రెండో విడతలో రూ.10 కోట్లు జమచేయగా ఇప్పుడు మంత్రి నాదెండ్ల మనోహర్ రూ.154 కోట్ల బకాయిలను విడుదల చేశారన్నారు. డెల్టా ఆధునికీకరణ పనులు చేపట్టాల్సిన ఆవశ్యకతను ప్రజాప్రతినిధులు మంత్రి మనోహర్‌కు వివరించారు. పౌరసరఫరాల శాఖ వైస్ చైర్మన్ జి.వీరపాండ్యన్, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, గిడ్డి సత్యనారాయణ, వేగుళ్ల జోగేశ్వరరావు, దేవ వరప్రసాద్, బండారు సత్యానందరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో పాటు పలువురు రైతుసంఘ నాయకులు వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం మంత్రి రైతులకు సంబంధించిన ధాన్యం బకాయిల చెక్కులను పంపిణీ చేశారు.

రాష్ట్రంలో 10 వేల డిపోలు

రాష్ట్రంలో మరో 10వేల చౌక డిపోలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రంలో 29వేల రేషన్ దుకాణాలు ఉన్నాయని వీటికి అదనంగా 10 వేల డిపోలను పెంచి త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేస్తామని చెప్పారు. వీటి ద్వారా బియ్యం, కందిపప్పు, పంచదార, పామాయిల్ వంటి సరుకులను లబ్ధిదారులకు అందించనున్నట్లు చెప్పారు.



ధాన్యం బకాయిల చెక్కును విడుదల చేస్తున్న మనోహర్

చవితి ఉత్సవాలపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఈవో

అయినవిల్లి, ఆగస్టు 12: ప్రముఖ పుణ్యక్షేత్రం అయినవిల్లిలో సెప్టెంబరు 7 నుంచి 15వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు జరిగే గణపతి నవరాత్రి ఉత్సవాల విజయవంతానికి అందరూ సహకరించాలని ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు కోరారు. అయినవిల్లిలో సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఆలయ పరిసరాలన్నీ సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు గతంలో మాదిరిగానే ఉత్సవ ఏర్పాట్లు చేసేందుకు నిర్ణయించారు. విద్యుత్ దీపాల అలంకరణ, పూల డెకరేషన్, మేళతాళాల ఏర్పాట్లు, సంప్రదాయబద్ధంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.



● మండపేట

కొట్టేశారు

మండపేట మండలం ద్వారపూడి పంచాయతీలో వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర షాపింగ్ కాంప్లెక్స్ అవినీతికి కేరాఫ్‌గా మారింది. అడుగడుగునా నిబంధనలను తుంగలో తొక్కి సర్పంచ్, ఉప సర్పంచ్ పర్యవేక్షణలో ఇష్టారాజ్యంగా కేటాయింపులు జరిగిపోయాయి. మొత్తం 39 షాపులు ఉండగా ప్రతి షాపు కేటాయింపులోనూ అవినీతి జరగడం గమనార్హం. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపై జిల్లా పంచాయతీ అధికారి చేసిన విచారణలో విస్తుపోయే ఎన్నో నిజాలు వెలుగులోకి వచ్చాయి.

● ద్వారపూడిలో దుకాణాల నిర్మాణంలో గోల్‌మాల్
● అడుగడుగునా అవినీతి ● నిబంధనల ఊసేలేదు
● లక్షలాది రూపాయలను కాజేసిన వైనం
● బయట వ్యక్తులకు షాపుల కేటాయింపు
● డీపీవో విచారణలో విస్తుపోయే నిజాలు

కోట్లు పేరుతో కొట్టేశారు


షాపింగ్ కాంప్లెక్స్‌లో మొత్తం 39 షాపుల నిర్మాణం జరిగింది. ఒక్కొక్క షాపుకు రూ.2.50 లక్షల అంచనా వ్యయం కాగా దానిని రూ.4.50 లక్షలకు పెంచి చూపించారు. ఇది మొత్తం అనధికారికంగానే జరిగిపోయింది. అలా పెంచిన సొమ్ము ప్రభుత్వ ఖజానాకు జమ కాలేదు. ఎవరి జేబులోకి వెళ్లిందో తెలియదు. ఎస్టిమేషన్ వేయడం, కానీ కమిటీ ఏర్పాటు చేయడం కానీ అధికారుల పర్యవేక్షణ కానీ లేకుండానే కాంప్లెక్స్ నిర్మాణం జరిగిపోయింది. దుకాణ లబ్ధిదారుడు ఒక్కొక్కరి దగ్గర నుంచి రూ.6 లక్షలు వసూలు చేసి అలా కూడా అక్రమాలకు పాల్పడ్డారు. దుకాణ సముదాయం నిర్మాణానికి సంబంధించి ఇంజనీరింగ్ అధికారులు, టెక్నికల్ అనుమతులు లేకుండానే సర్పంచ్, ఉప సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి భాగస్వామ్యంతో పనులు జరిగాయని గుర్తించారు. నిబంధనల మేరకు టెండర్లు పిలవాలి, పనికి ప్రభుత్వ అనుమతి ఉండాలి కానీ అవేమి లేకుండానే పాలకవర్గం తమ ఇష్టానురీతిన పనులు చేసింది.

నిబంధనల ఉల్లంఘన

నిబంధనల మేరకు పంచాయతీలో కేవలం రూ.50 వేల నుంచి రూ.5 లక్షలు వరకు మాత్రమే గ్రామ పంచాయతీ పాలకవర్గం పనులు కేటాయించే హక్కు ఉంది. కానీ ఇక్కడ రూ 1.75 కోట్ల పనులు పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్ చేయడం గమనార్హం. ఇది నిబంధనల ఉల్లంఘనే. అనపర్తికి చెందిన ఒక ప్రైవేటు సంస్థ వద్ద షాపింగ్ కాంప్లెక్స్ ప్లాన్ అంచనాలు తమకు అనుకూలంగా పాలకవర్గం తయారు చేయించినట్టు విచారణలో గుర్తించారు. ప్రభుత్వ ఇంజనీరు వేసిన దుకాణం ఒక్కదానికి రూ.2.5 లక్షలు అంచనా వేయగా ప్రైవేటు సంస్థ వేసిన ఎస్టిమేట్‌లో షాపు ఒక్కదానికి రూ.4.5 లక్షలుగా అధిక నిర్మాణ వ్యయం చూపించి అవినీతికి పాల్పడ్డారు. ఇక్కడే రూ.58 లక్షలు మేర అవినీతి జరిగిందని తేలింది.

రిజర్వేషన్ పాటించలేదు..

దుకాణాల కేటాయింపులో కూడా రిజర్వేషన్లు పాటించలేదు. మొత్తం 39 షాపుల్లో ఓసీకి 22, బీసీకి 16, ఎస్సీకి 1 కేటాయించారు. నిబంధనల ప్రకారం ఎస్సీలకు 6, ఎస్టీకి 3 షాపులు కేటాయించాల్సి ఉండగా ఎస్సీలకు కేవలం 1 షాపు కేటాయించడం గమనార్హం. ఎస్టీలకు ఒక్క షాపు కూడా కేటాయించలేదు. అలాగే స్థానికేతరులకు దుకాణాలు కేటాయించినట్టు కూడా జిల్లా పంచాయతీ అధికారి విచారణలో బహిర్గతమైంది. బైలా ప్రకారం స్థానికులకు మాత్రమే షాపులు కేటాయించాల్సి ఉండగా నిబంధనలు పాటించలేదు. ఇలా మొత్తం ఈ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో రూ.కోటికి పైగా అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మొత్తం అవినీతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిగితే మరికొంతమంది పెద్ద తలకాయల పేర్లు బయటకు వస్తాయని పలువురు చెబుతున్నారు. అలాగే బహిరంగ విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



సీతాకోక చిలుకమ్మా... సింగారం నీదేనమ్మా!



పచ్చని చిలుకలు తోడుంటే
పాడే కోయిల వెంటుంటే
భూలోకమే ఆనందానికి ఇల్లు....
అని ఓ సినీకవి వర్ణించినట్టు
కనిపిస్తున్నాయి కదూ ఇవి...
కానీ ఇవి చిలుకలు కాదు
సీతాకోకచిలుకలు. అల్లూరి
సీతారామరాజు జిల్లా
మోతుగూడెం పరిధిలోని పొల్లూరు
విద్యుత్ కేంద్రం వద్ద సోమవారం
ఇలా కనువిందు చేశాయి.

- మోతుగూడెం



రేపటి నుంచి వాడపల్లి వెంకన్న పవిత్రోత్సవాలు

ఆత్రేయపురం, ఆగస్టు 12: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలను గురువారం నుంచి మూడు రోజుల పాటు తిరుమల తరహాలో వైభవంగా నిర్వహించనున్నారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు సకలదోష పరిహారార్థం ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. సంకల్పం, విశ్వక్సేన పూజ, దీక్షాధారణ, అకల్మష హోమం, సాయంత్రం అంకురార్పణ, వాస్తు పూజలతో బుధవారం ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 15వ తేదీన ప్రధాన హోమాలు, అష్టకలశారాధన, పవిత్ర ప్రతిష్ఠ హోమాలు, పవిత్ర ఆరోహణ, 16న మహాశాంతి హోమం, ప్రాయశ్చిత్త హోమం, పూర్ణాహుతి, పవిత్ర విసర్జన, మహాదాశీర్వచనంతో ఉత్సవాలు ముగుస్తాయి. వీటికి సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో 14 నుంచి 16వ తేదీ వరకు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు, ఉపనయనాలను రద్దు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.



నేడు మంత్రి నాదెండ్ల మనోహర్
కాకినాడ రాక
కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 12: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం కాకినాడ రానున్నారు. ఉదయం పది గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్, పోర్టు, పోలీసు, కస్టమ్స్, పౌర సరఫరాలు, కార్పొరేషన్ అధికారులతో బియ్యం ఎగుమతులు, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా నియంత్రణపై సమీక్షిస్తారు.



తనకు జరిగిన మోసాన్ని డీఆర్వోకు వివరిస్తున్న బాధితుడు కృష్ణమోహన్

పెళ్లి పేరిట రూ.6 లక్షలకు టోకరా
మహిళ, మరో 11 మందిపై డీఆర్వోకు ఫిర్యాదు

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 12: పెళ్లి పేరుతో ప్రియ అనే మహిళ తనకు రూ.6 లక్షలకు టోకరా వేసిందని కాకినాడకు చెందిన కృష్ణమోహన్ కాకినాడ కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో డీఆర్వో తిప్పేనాయక్‌కు సోమవారం ఫిర్యాదు చేశాడు. ఈ వ్యవహారంలో భాగస్వాములైన 11 మందిపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. నిశ్చితార్థం రోజున తనవద్ద రూ.6లక్షలు తీసుకుని మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు. ఇలాంటి మోసాలు జరగకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో
బైక్ రైడర్ దుర్మరణం

తొండంగి, ఆగస్టు 12: కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి వై.జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన యూట్యూబర్, బైక్ రైడర్ పుగాకు సోంబాబు (35) దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి...



మృతుడు సోంబాబు (పాత చిత్రం)

హైదరాబాద్‌కు చెందిన సోంబాబు మరో ఇద్దరితో కలిసి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఈ నెల 10న జరిగిన మిత్రుని వివాహానికి హాజరయ్యారు. అక్కడి నుంచి వారంతా విశాఖపట్నం వెళ్లి తిరిగి వస్తుండగా బెండపూడి వై.జంక్షన్ వద్ద హైవే ఎక్కుతున్న బస్సు ఢీకొనడంతో సోంబాబు తీవ్రంగా గాయపడ్డాడు. 108 అంబులెన్సులో తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. తొండంగి ఎస్ఐ వినయ్‌ప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆ ఘనులెవరో!

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వందల కోట్లు దోపిడీకి గురయ్యాయి. కనీస లీజు విధానం పాటించకుండా, ఒక పద్ధతిగా వ్యవహరించకుండా దశాబ్దాలుగా గనుల వెలికితీత పనిలో నిమగ్నమైన లీజుదారులను తరిమేసి గనులను దోచేసుకోవడం గమనార్హం. వైసీపీ అరాచకాలు, ఆగడాలను తట్టుకోలేదని అనేక మంది లీజుదారులు వ్యాపారాలు వదిలేసుకున్నారు. తమ లారీలు, ఎక్సకవేటర్లు మొదలైన వాటిని అయినకాడికి అమ్మేసుకున్నారు. చాలా మంది క్రషర్లు ఆగిపోయాయి. వైసీపీ పీడ వదిలి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.

- గనులను దోచేసిన వైసీపీ నేతలు
- గత లీజుదారులను తరిమేసి.. నిలువుదోపిడీ
- గనుల శాఖ ఉన్నతాధికారుల సహకారం
- ప్రభుత్వ పెద్దల ఇష్టారాజ్యం
- చక్రం తిప్పిన మాజీ మంత్రి అనుచరులు
- కూటమి ప్రభుత్వం రావడంతో బయటకొస్తున్న బాధితులు
- భయపడుతున్న అక్రమార్కులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గంలో అనేక కొండలు అదృశ్యమైన సంగతి తెలిసిందే. సీతానగరం మండలం నాగంపల్లి కొండల శ్రేణుల్లో బిల్డింగ్ మెటల్ దొరుకుతుంది. దానికి గతంలో ఓ వ్యాపారి దరఖాస్తు చేసుకున్నాడు. గత ప్రభుత్వంలో అతడిని ఇబ్బంది పెట్టి రాయలసీమ ప్రాంతానికి చెందిన ఓ మంత్రి బంధువైన నెల్లూరుకు చెందిన ఒక వ్యక్తి మధ్యలో దూరాడు. స్థానిక నేతలపై ఒత్తిడి తెచ్చి వందలాది ఎకరాల కొండలను వేలం వేయడానికి సిద్ధం చేసినట్టే చేసి తర్వాత వాటన్నింటినీ హోల్డ్‌లో పెట్టి ఇష్టానుసారం దోచుకోవడం గమనార్హం. పోలవరం కాలువ ఒడ్డున ఉన్న క్రషర్లలో చాలా వాటికి అనుమతి లేకపోవడం గమనార్హం. మన జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఒకరు ఇక్కడ క్రషర్‌ను కైవసం చేసుకున్నట్టు చెప్తున్నారు. వైసీపీ మరోసారి అధికారంలోకి వస్తే దేవీపట్నం మండలం, సీతానగరం, కోరుకొండ, గోకవరం సరిహద్దుల్లో ఉన్న కొండలన్నిటినీ మాయం చేయడానికి పెద్ద స్కెచ్ వేసినట్టు ఇపుడిపుడే బయటపడుతోంది.

ఉమ్మడి జిల్లాలో లేటరైట్ దోపిడీ రూ.కోట్ల మీదే ఉండడం గమనార్హం. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని ప్రత్తిపాడు మండలం చింతలూరు, వంతాడ గ్రామాల్లో లేటరైట్ గనులు ఉన్నాయి. గతంలో వీటిని ప్రస్తుత తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి గ్రామానికి చెందిన ఆంధ్రాస్ సంస్థ, ఓ ప్రముఖ సినీ నటి మేనల్లుడికి చెందిన మహేశ్వరి మినరల్స్, అనపర్తి మండలానికి చెందిన సత్తి లక్ష్మణరెడ్డి, గంగాధరరెడ్డిలకు చెందిన కంపెనీలు లీజుకు తీసుకుని లేటరైట్ వ్యాపారం చేసేవి. వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీ పెద్దల కన్ను లేటరైట్ మీద పడింది. రాజమహేంద్రవరం విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో క్షుణ్ణంగా అక్కడ తవ్వకాలు, గనుల పరిస్థితిపై విచారణ చేయించి రిపోర్టును రాజమహేంద్రవరం విజిలెన్స్ ఆఫీసుకు తెలియనీయకుండా రాష్ట్ర కార్యాలయానికి రప్పించుకున్నారు. అప్పట్లో ఇక్కడ బాక్సైట్ ఉందనే ప్రచారం జరిగింది. విజిలెన్స్, మైన్స్ అధికారులు కూడా అప్పట్లో మౌనం వహించిన సంగతి తెలిసిందే. ఇక్కడ పరిస్థితిపై రిపోర్టు తీసుకెళ్లిన తర్వాత కొద్దిరోజులు పనులు ఆగాయి. ఇంతలో నర్సీపట్నం ఏరియాలో లేటరైట్ అక్రమాలు తవ్వకాలు జరుగుతున్నాయని టీడీపీ, ఇతర ప్రతిపక్షాలు ఆందోళన చేయడంతో అక్కడ తవ్వకాలు ఆగాయి. సిమెంట్ ఫ్యాక్టరీలకు లేటరైట్ అవసరం. ఈ పరిస్థితుల్లో వైసీపీ పెద్దలు చింతలూరు, వంతాడ నుంచి లైటరైట్ తరలించుకుపోవడానికి కుట్ర చేశారు. అప్పటికే సుమారు 4 లక్షల టన్నుల వరకూ లేటరైట్ స్టాక్ ఉంది. దీనిని తరలించుకుపోవడానికి ఒత్తిడి చేశారు. కానీ అక్కడి లీజుదారులు ఒప్పుకోలేదు. దీంతో 2010 నుంచి పెండింగులో ఉన్న ఓ సంక్షేమ సేవా సమితి అప్లికేషన్‌ను తెరమీదకు తెచ్చారు. దానిపేర బినామీ లీజు పొందారు. కానీ అక్కడ లేటరైట్ లేదని 2017లోనే ఇది ఎలిజిబుల్ కాదని, అప్పటి డీఎంజీ (ఎఫ్ఏసీ) బి.శ్రీధర్ ఫైలును రాజమహేంద్రవరం మైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు పంపించారు.

ఇదిలా ఉండగా 2022 మార్చి 11న చింతలూరులోని సర్వే నెం.1లో సుమారు 36 హెక్టార్లలో లీజు ఖరారు చేస్తూ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ ఉన్నతాధికారి ఉత్తర్వు జారీ చేశారు. ఇక్కడ లేటరైట్‌ను బెనిఫికేషన్, సెపరేషన్, స్టోరింగ్, సెల్లింగ్ చేయడానికి లైసెన్స్‌ను ఓ మాజీ మంత్రి బంధువు పేరిట ఇచ్చారు. కానీ వారు లీజు దక్కించుకున్న సంక్షేమ సేవా సమితి లీజు స్థలంలో అసలు మైనింగ్ చేయకుండా గతంలో లీజుకు తీసుకున్న వారి భూముల్లో లేటరైట్ తవ్వేయడంతో పాటు... వారి స్టాక్ పాయింట్లలోని లేటరైట్ తరలించుకుపోవడం గమనార్హం. ఇక్కడ అటవీ ప్రాంతంలోని కొండలు తవ్వేసినట్టు కొందరు చెప్తున్నారు. ఇంత జరుగుతున్నా వైసీపీ పెద్దల అరాచకాలకు భయపడి లీజుదారులు మౌనంగా ఉండిపోయారు.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొందరు లీజుదారులు ముందుకు వచ్చి ఇక్కడి అక్రమాలపై ఫిర్యాదు చేస్తున్నారు. అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన సత్తి లక్ష్మణరెడ్డి జూన్ 10వ తేదీన విజయవాడ ఇబ్రహీంపట్నంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మైన్స్ జియాలజీకి ఫిర్యాదు చేయడం గమనార్హం. ఇక్కడ సుమారు 10 లక్షల టన్నుల లేటరైట్ అక్రమ తవ్వకాలు జరిగినట్టు అందులో ఫిర్యాదు చేశాడు. మిగతావారు కూడా ఒక్కొక్కరుగా నెమ్మదిగా బయటకి వస్తున్నారు.

మైనింగ్ అక్రమాలపై కూటమి ప్రభుత్వం సీరియస్!

జిల్లా నుంచి లేటరైట్, గ్రావెల్, చింతూరు ప్రాంతం నుంచి క్వార్ట్జ్ కూడా అక్రమంగా తరలించుకు పోయినట్టు ఆరోపణలు ఉన్నాయి. గజ్జనపూడి ఫారెస్ట్‌లో అక్రమ మైనింగ్ చేసి పలు కేసుల్లో ఇరుక్కుని విజిలెన్స్ విధించిన జరిమానాలు కూడా కట్టకుండా తప్పించుకున్న వ్యక్తితో కూడా కుమ్మక్కయి అక్కడ రివిజన్ చేయించే ప్రయత్నాలు చేయడం గమనార్హం. ప్రభుత్వం మారడంతో అది ఆగిపోయింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ మైనింగ్ అక్రమాలపై సీరియస్‌గా ఉన్న సంగతి తెలిసిందే. ఈ అక్రమాలకు ప్రధాన కారకుడైన ఉన్నతాధికారిని సస్పెండ్ చేయడంతో పాటు ఆయనపై ఏసీబీ విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. మరోపక్క ఇసుక, గనుల అక్రమాలపై సీబీసీఐడీతో విచారణ చేయించనున్నారు. ఇప్పటికే ఇతర జిల్లాల్లో విచారణకు రాజమహేంద్రవరం విజిలెన్స్ అధికారులు కొందరు నియమితులు కావడం గమనార్హం. త్వరలో జిల్లాలో కూడా విచారణ చేపట్టనున్నారు. రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఇటీవల రాజమహేంద్రవరం వచ్చినపుడు కొందరు బాధితులు తమ గోడు విన్నవించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే బాధితులెవరైనా సరే ధైర్యంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. గనులను దోచేసిన ఆ ఘనుల సంగతి త్వరలో తేలుతుందని జిల్లాకు చెందిన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చెప్పడం గమనార్హం.



రాఘవ కనస్ట్రక్షన్స్ పేరిట ప్రతిమా ఇన్‌ఫ్రా దోపిడీ!


వైసీపీ ఆధ్వర్యంలో ఏ నిబంధనలూ పాటించకుండా రూ.కోట్లలో ఇసుక దోపిడీ చేశారు. మొదట జేపీ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చి కనీసం ర్యాంపుల సరిహద్దులు కూడా గుర్తించని సంగతి తెలిసిందే. పైగా ఆన్‌లైన్ నిలిపివేసి కేవలం నగదు రూపేణా మాత్రమే వసూలు చేశారు. గత ఏడాది మేనెలలో ఆ సంస్థ కాంట్రాక్టు గడువు ముగిసినప్పటికీ దాని పేరిటే డ్రెడ్జింగ్ కూడా చేశారు. ఆ సంస్థను పక్కన పెట్టి వైసీపీ పెద్దలే కొవ్వూరు వైపు ఒకరికి, రాజమహేంద్రవరం వైపు ఒకరికి ఇచ్చేసి... నెలకు రూ.30కోట్ల వరకు కప్పం కట్టించుకున్నారు. తర్వాత కోర్టు జోక్యంతో ప్రతిమా ఇన్‌ఫ్రా సంస్థను తెరమీదకు తెచ్చి, దాని పేరిట ఆర్‌కే అనే వ్యక్తి మొత్తం దోపిడీ చేశారు. అంతేకాక అంతకు ముందే డ్రెడ్జింగ్‌కు ఒప్పందం కుదుర్చుకున్న రాఘవ కనస్ట్రక్షన్‌ను అప్పటి వరకు పనిచేయనివ్వకుండా చేసి గత ఏడాది డిసెంబరులో వాళ్లనూ తెరపైకి తెచ్చి మరింత దోచేశారు. చివరకు రాఘవ కనస్ట్రక్షన్ కంపెనీకి ఇవ్వాల్సిన డబ్బు కూడా ఎగ్గొట్టి ప్రతిమా ఇన్‌ఫ్రా సంస్థ పనులు వదిలేసి వెళ్లిపోవడంతో ఇవాళ అధికారులు లబోదిబోమంటున్నారు. కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారాలపై విచారణ చేపట్టనుంది.



చెట్టు మోదులను పైకిలేపిన దృశ్యం

సినిమా చెట్టు... నిలబడేటట్టు!

కొవ్వూరు, ఆగస్టు 12: తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవంలో నేలకొరిగిన సినిమా చెట్టును పునరుజ్జీవింపచేసే పనులకు రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్ సభ్యులు సోమవారం శ్రీకారం చుట్టారు. నేలవాలిన చెట్టు కొమ్మలకు లేపనాలు పూశారు. చెట్టు కొమ్మలను పూర్తిగా కత్తిరించి రెండుగా విడిపోయిన మాను భాగాలను పైకిలేపి ఒక్కటిగా కలిపే యత్నం చేశారు.





రికార్డులను పరిశీలిస్తున్న ఆర్జేసీ సుబ్బారావు, అధికారులు

భీమేశ్వరస్వామి దేవస్థానంలో రికార్డుల తనిఖీ

ద్రాక్షారామ, ఆగస్టు 12: ద్రాక్షారామ భీమేశ్వరస్వామి దేవస్థానంలో అవినీతి, అవకతవకలు ఆరోపణల నేపథ్యంలో దేవదాయ శాఖ అధికారులు సోమవారం వసతి గృహంలో రికార్డుల తనిఖీ చేపట్టారు. ఈవో పీటీవీ సత్యనారాయణపై మంత్రి వాసంశెట్టి సుభాష్ దేవదాయ శాఖ కమిషనరుకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కమిషనరు ఆదేశాలతో ఇప్పటికే దేవదాయ శాఖ ఆర్జేసీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు కె.సుబ్బారావు ఈ నెల 9న ద్రాక్షారామలో ఫిర్యాదులు స్వీకరించారు. అంతేగాక గత ఐదేళ్ల పాటు దేవస్థానం రికార్డులను తనిఖీ చేయడానికి అధికారుల బృందాన్ని నియమించారు. ఆర్జేసీ సుబ్బారావు పర్యవేక్షణలో సహాయ కమిషనరు ఎస్ఎస్ చక్రధరరావు, కమిషనరు కార్యాలయ పర్యవేక్షకురాలు జ్యోతి, ఈవోలు సన్యాసిరావు, కె.శ్రీనివాసరావు, వెంకట్రావు, ఏఈ ఈశ్వర్, కమిషనరు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకట్రావు, ఆర్జేసీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఆచంట శ్రీనివాస్ రికార్డుల పరిశీలన ప్రారంభించారు. ఈవోపై వచ్చిన పలు ఫిర్యాదులతో పాటు రికార్డుల పరిశీలన ఆధారంగా కమిషనరుకు నివేదిక సమర్పిస్తారు. అంతేగాక గత ఐదేళ్లలో జరిగిన పూర్తి లావాదేవీలపై కూడా అధికారుల బృందం నివేదిక ఇవ్వనున్నట్టు తెలుస్తోంది.

కట్టు కాల్వలో కాళ్లు కడుక్కునేందుకు దిగిన
యువకుడు మృతి
ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం బీచ్ వద్ద ఘటన

ఉప్పలగుప్తం, ఆగస్టు 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం బీచ్ వద్ద ప్రమాదవశాత్తు కట్టు కాల్వలో పడి అమలాపురం మండలం వన్నెచింతలపూడికి చెందిన చికిలే సందీప్ (17) మృతి చెందాడు. సందీప్ సోమవారం మిత్రులతో కలిసి ఎస్.యానాం బీచ్‌కు వచ్చాడు. సముద్రంలో స్నానాల అనంతరం సమీపంలో ఉన్న కట్టుకాల్వలో కాళ్లు శుభ్రం చేసుకునేందుకు దిగి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. స్థానిక మత్స్యకారులు అతడిని రక్షించి ఒడ్డుకు తీసుకొచ్చారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఇంటర్ చదివిన సందీప్ విశాఖలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో చేరాడు. అతడి సోదరుడు గౌతమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మనోహర్‌జోషీ తెలిపారు.



మృతుడు సందీప్ (పాత చిత్రం)

గంజాయి కేసులో నలుగురి అరెస్టు

చింతూరు, ఆగస్టు 12: గంజాయి కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు సీఐ గజేంద్రకుమార్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడకు చెందిన బప్పిరాయ్, కిరండోల్‌కు చెందిన షివేందురాయ్, సుక్మాకు చెందిన ధర్మేంద్ర సింగ్ మనిష్‌సింగ్ గంజాయితో పట్టుబడ్డారు. వీరంతా ఛత్తీస్‌గఢ్‌లోని కుంట నుంచి చింతూరు మండలం చట్టి మీదుగా భద్రాచలం వైపు ఆదివారం రాత్రి పదకొండు గంటల సమయంలో కారులో వెళ్తున్నారు. తనిఖీల్లో భాగంగా కారును ఆపి డిక్కీ తెరిచి చూడగా అందులో 15 కిలోల గంజాయి కనిపించింది. కారుతో పాటు అందులో వున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. ఇదే కేసులో వీరితో పాటు కుంటకు చెందిన ఇషాద్, పవన్‌లపై కూడా తమకు అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని, వారిద్దరూ పరారీలో వున్నారని సీఐ చెప్పారు.

గేమ్ చేంజర్: ఎల్లో ఉగ్రవాది
ఈ పేరుతో సోషల్ మీడియాలో రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం
భారత న్యాయ సంహిత చట్టం కింద ఎటపాక పోలీస్ స్టేషన్లో కేసు నమోదు

రంపచోడవరం, ఆగస్టు 12: చంద్రబాబు సారథ్యంలో ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం సాగించి ప్రభుత్వ విచ్ఛిన్నానికి పాల్పడుతున్న వారిపై మన్యంలో కేసు నమోదైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక పోలీసు స్టేషన్లో క్రైం నెం.104/2024 కింద నమోదైన కేసు వివరాలు ఇలా వున్నాయి.... రాష్ట్రంలో యూట్యూబ్ అకాడమీ స్థాపించడానికి యూట్యూబ్ గ్లోబల్ సీఈవోతో జరిగిన చర్చలపై గూగుల్ హెడ్‌ని ట్యాగ్ చేసి 'ఎక్స్'లో ముఖ్యమంత్రి పోస్టు పెట్టారు. దానికి గేమ్ చేంజర్: ఎల్లో ఉగ్రవాది అనే అతను రిప్లై ఇస్తూ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సక్రమంగా లేదని గూగుల్‌ని ట్యాగ్ చేస్తూ.... మీ కంపెనీలో మహిళా ఉద్యోగులు వేధింపులకు గురైనా పోలీసులు చూస్తూ ఉంటారనడంతో పాటు పలు అంశాలను ప్రస్తావిస్తూ రిప్లై ఇచ్చాడు. ఇలా సోషల్ మీడియాలో నేరపూరిత కుట్రకు పాల్పడటం, వర్గ విభేదాలను సృష్టించడం, తప్పుడు ప్రకటనలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఎటపాకకు చెందిన పాటి సంపత్, మరో ఇద్దరు ఎటపాక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో భారత న్యాయ సంహిత చట్టంలో 61(2), 196(1), 353(2) సెక్షన్ల కింద ఎటపాక పోలీసులు కేసు నమోదు చేశారు. ఐటీ నిపుణుల సహాయంతో సోషల్ మీడియా సంస్థల నుంచి సమాచారాన్ని సేకరిస్తూ నిందితులను గుర్తించే దిశలో కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సామర్లకోట, ఆగస్టు 12: సామర్లకోట-పిఠాపురం రైల్వే లైన్ మధ్య నడుస్తున్న 48 ఏళ్ల వ్యక్తిని అతి వేగంగా వెళ్తున్న భువనేశ్వర్-రామేశ్వరం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందినట్టు సామర్లకోట రైల్వే పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి ఎస్ఐ ఎన్.రవికుమార్ సోమవారం రాత్రి చెప్పారు. ఈ మేరకు రైలు లోకో పైలట్ సామర్లకోట రైల్వే అధికారులకు ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టినట్టు చెప్పారు. నలుపు, తెలుపు, డార్క్ చెక్స్ షర్ట్ ధరించి, ఆరెంజ్, ఎల్లో రంగుతో కూడిన షార్ట్ నిక్కరు మాత్రమే ధరించి ఉన్నాడు. అంతకు మించి ఎటువంటి చిరునామా లభించలేదని ఎస్ఐ చెప్పారు.

ఆక్వా చెరువుల తవ్వకాలపై ఫిర్యాదు

అల్లవరం,ఆగస్టు12: రెల్లుగడ్డ గ్రామంలో జనవాసాల మధ్య అనుమతులు లేకుండా వైసీపీ నాయకులు నడింపల్లి నాగరాజు తవ్విన ఆక్వా చెరువులను నిలుపుదల చేయాలని అధికారులకు దళితపేట వాసులు ఫిర్యాదు చేశారు. ఉప్పునీటి చెరువులు వల్ల వరిసాగుకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. ఆక్వా చెరువులను మూసివేయాలని తహసీల్దారు, ఎఫ్‌డీవో, విద్యుత్‌శాఖ ఏఈలకు రెల్లుగడ్డ దళితపేట వాసులు ఫిర్యాదు చేశారు. పి.కొండలరావు, పి.నరసింహమూర్తి తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

తండ్రి హత్యకు కారకులను శిక్షించాలి

ఎస్పీకి ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు


మాట్లాడుతున్న సనా ఫాతిమా కుటుంబ సభ్యులు

అమలాపురం టౌన్, ఆగస్టు 12: తన తండ్రి హత్యకు కారకులైన వైసీపీ నాయకులను అరెస్టుచేసి న్యాయం చేయాలని కోరుతూ రాయవరం మండలం పసలపూడికి చెందిన కొవ్వూరి శ్రీలక్ష్మి అలియాస్ సనా ఫాతిమా కుటుంబ సభ్యుల బృందం సోమవారం ఎస్పీ బి.కృష్ణారావును కలిసి వినతిపత్రం అందించారు. వైసీపీ నాయకుల నుంచి ప్రాణ హాని ఉందని తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని వేడుకున్నారు. అర్జీ అందించిన అనంతరం సనా ఫాతిమా కుటుంబ సభ్యులు విలేకరులతో మాట్లాడారు. ఈఏడాది మార్చి30న పసలపూడి హరిజనపేటకు చెందిన వైసీపీ నాయకుడు కోరుకొండ రమణ, కోరుకొండ సాయి, బుంగ పెద్ద, గంటి గంగరాజు తదితరులు తన తండ్రి కొవ్వూరి కృష్ణపై అమానుషంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచారన్నారు.అప్పట్లో ప్రభుత్వాసుపత్రిలో చేర్పించామని వైసీపీ నాయకుల వత్తాసుతో పోలీసులు సక్రమంగా కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. మరుసటి రోజు తనతండ్రి కృష్ణ ఆసుపత్రిలో మృతిచెందాడన్నారు. విచారణ జరిపి హత్యకు పాల్పడ్డ వైసీపీ నాయకులను అరెస్టు చేసి తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని ఫాతిమా, ఆమె సోదరీమణులు కె.మేరీ, సీహెచ్‌మంగాయమ్మ కోరారు.

- ఇంటింటికీ కుళాయి ఉన్నా, తాగునీటికి ఇక్కట్లే
- పట్టించుకోని పంచాయతీలు
- స్పందించని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

గ్రామాల్లో దాహం.. దాహం..



చల్లపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు ఓవర్‌హెడ్ ట్యాంకు
గొల్లవిల్లి ఎన్టీఆర్ కాలనీలో తాగునీటి కోసం బిందెల నిరీక్షణ

ఉప్పలగుప్తం, ఆగస్టు 12: మండలంలో మూడు ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టులున్నాయి. స్టోరేజీ ట్యాంకులు ఎల్లవేళలా నీటితో కళకళలాడుతుంటాయి. గ్రామాల్లో మాత్రం బిందె నీళ్ల కోసం మహిళలు గంటల తరబడి వేచిచూడాల్సిందే. కుళాయిల నుంచి నీరు రాదు. కారుతుందంతే. రెండు నెలలుగా చల్లపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు పరిధిలోని 12 గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ అధికారులు ఒకరిపై ఒకరు లోపాలను నెట్టేసి ప్రజలను ఇబ్బంది పెట్టేస్తున్నారు. అసలు సమస్యకు పరిష్కారం చూపించకుండా కాలం గడిపేస్తున్నారు. తాగునీటి సమస్యతో ప్రజలు పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం మాత్రం దొరకదు. జలజీవన్ మిషన్‌లో ఇంటింటికి కుళాయిలు వేశారు. అయితే నీటి సరఫరా మాత్రం తగినంతగా లేకుండా ఇంటింట కుళాయి పథకం అమలు చేయడంతో సమస్య ఎదురయ్యింది. ఇప్పటికే రోజూ ఇచ్చే నీటిని రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్నారు. అయినా నీటి ఇక్కట్లు తప్పడంలేదని ప్రజలు వాపోతున్నారు. ప్రధానంగా వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, ఎన్టీఆర్ కాలనీ, సన్నవిల్లి, వాసాలతిప్ప, పెదగాడవిల్లి, మునిపల్లి గ్రామాలకు చాలా కాలంగా తాగునీటి కొరత వేధిస్తోంది. కొందరు కుళాయిలకు మోటార్లు అమర్చి నీటిని తోడేసుకోవడంతో దిగువ వారికి నీరందడం లేదు. సమస్య ఎక్కడున్నదో అధికారులకు తెలిసినా ప్రజాప్రతినిధుల జోక్యంతో ఏమీ చేయలేక పోతున్నారన్న ఆరోపణలున్నాయి. దీనికి తోడు విద్యుత్ ఇక్కట్ల కారణంగా సకాలంలో పంపింగ్ జరగక ప్రతి రోజూ అన్ని పంచాయతీలకు నీరివ్వలేకపోతున్నారు. సమస్య పరిష్కారానికి చల్లపల్లి ప్రాజెక్టుకు నేరుగా విద్యుత్ లైన్ పునరుద్ధరణ, మోటార్ల తొలగింపు, పైప్‌లైన్ల ఆధునీకరణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మౌలిక వసతులతోనే గ్రామాల పురోభివృద్ధి



అమలాపురం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు   మండపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు
సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణా తరగతులు

అమలాపురం రూరల్, ఆగస్టు 12: పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తే గ్రామాలు ఎంతో పురోభివృద్ధిని సాధిస్తాయని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. పార్టీలకు అతీతంగా ఎన్నికైన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గస్థాయి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయనప్రారంభించారు. అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం ఎంపీడీవోలు జి.మల్లికార్జునరావు, కృష్ణమోహన్, కె.వెంకటేశ్వరప్రసాద్, ఎస్ఏఆర్డీ పరిశీలకుడు శ్రీనివాసరావు, రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పనిచేయాలి

మండపేట, ఆగస్టు 12: గ్రామాల్లో ప్రజాప్రతినిధులు పార్టీలకు అతీతంగా పనిచేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సర్పంచ్‌లకు పిలుపు నిచ్చారు. గ్రామాలను అభివృద్ధి చేయడంతో పాటు ప్రజాసమస్యలను పరిష్కరించి మంచి పేరు తెచ్చుకోవాలని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో శ్రీదేవి అధ్యక్షతన సర్పంచ్‌లు, కార్యదర్శులు శిక్షణా తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడారు. ప్రభుత్వ ప్రత్యేక పరిశీలకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ గ్రామాల అభివృద్ధి, సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించారన్నారు. వీధిలైట్లు, మంచినీరు సరఫరా తదితర పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ రాజు, సూపరింటెండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే వేగుళ్లను ఎంపీడీవో శ్రీదేవి, సర్పంచ్‌లు, కార్యదర్శులు సత్కరించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

అంతర్వేది, ఆగస్టు 12: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సఖినేటిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచ్‌ల శిక్షణా తరగతులను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధి, తాగునీరు, వనరులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పీవీ సత్యనారాయణ, సర్పంచ్‌లు గొల్లమండల చిట్టిబాబు, పోతురాజు నరసింహారావు (కిశోర్), దెందుకూరి శ్రీహరిరాజు, కార్యదర్శులు అడబాల గంగరాజు, దాసరి సత్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే కొత్తపేట, మామిడికుదురు, రాజోలు, ఆత్రేయపురం, అంబాజీపేట, ఉప్పలగుప్తం, ఆలమూరు, రావులపాలెం, ద్రాక్షారామ, కె.గంగవరం, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహించారు

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

పి.గన్నవరం, ఆగస్టు 12: స్వాతంత్ర్య వేడుకలపై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు ఏర్పాటుచేసిన శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. స్వాతంత్ర్య వేడుకలకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మైనర్ పంచాయతీలకు రూ.10వేలు, మేజర్ పంచాయతీలకు రూ.25వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంఈవో కె.హెలీనా, వైస్ ఎంపీపీ చెల్లుబోయిన గంగాదేవి, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు యర్రంశెట్టి త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

ముమ్మిడివరం, ఆగస్టు 12: గ్రామాల అభివృద్ధిపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు నిర్దిష్ట ప్రణాళిక రూపొందించుకోవాలని ఎంపీడీవో కేవీ నరసింహారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన సర్పంచ్‌లు, కార్యదర్శులకు మూడు రోజులు నిర్వహించే శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. పరిపాలనాధికారి ఏఎస్ శ్రీనివాస్, ఈవోపీఆర్డీ సీహెచ్ఎల్ కల్యాణి, మండలంలోని సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించాలి

మలికిపురం, ఆగస్టు 12: సర్పంచ్‌లు గ్రామానికి రాష్ట్రపతి వంటి వారని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మంచినీరు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచ్‌లు, వార్డుసభ్యులు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. విధులు, బాధ్యతలు, పారిశుధ్యం అంశాలపై సీనియర్ కార్యదర్శులు సుభాకర్, బొంతు శ్రీహరి, ఎస్డీఎస్ ప్రసాద్ శిక్షణ ఇచ్చారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీడీవో మంగాదేవి పాల్గొన్నారు.

రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యుల ఎన్నిక



కృష్ణపద్మరాజు వెంకటరమణ

అమలాపురం టౌన్, ఆగస్టు 12: అమలాపురం పట్టణానికి చెందిన యెనుముల కృష్ణపద్మరాజు, దొమ్మేటి వెంకటరమణ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులుగా ఎన్నికయ్యారు. విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సభ్యుల ఎన్నికల్లో జిల్లా నుంచి వారికి ప్రాతినిధ్యం కల్పించారు. కృష్ణపద్మరాజును రాష్ట్ర ఉపాధ్యక్షుడిగాను, వెంకటరమణను ఎగ్జిక్యూటివ్ మెంబరుగాను ఎన్నుకుని ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జిల్లా అసోసియేషన్ సభ్యులు వంటెద్దు వెంకన్నాయుడు, నగభేరి కృష్ణమూర్తి, గారపాటి చంద్రశేఖర్, మట్టపర్తి సముద్రం, కంకిపాటి వెంకటేశ్వరరావు అభినందనలు తెలిపారు.

ఈ-పంట నమోదు పరిశీలన

ద్రాక్షారామ, ఆగస్టు12: ఏరుపల్లిలో వ్యవసాయశాఖ ఏడీఏ ఏవీఎస్ రంగారావు, ఏవో సత్యప్రసాద్ సోమవారం ఈ-పంట నమోదు పరిశీలించారు. రైతులకు ఈపంట నమోదుపై అవగాహన కల్పించి, ఈపంట నమోదు ప్రయోజనాలు వివరించారు.

నీకు తెలుసా..

అమలాపురం టౌన్, ఆగస్టు 12: హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండేలా రూపొందించిన 'నీకు తెలుసా' ప్రచార వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ, నివారణా సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన 200 గ్రామాల్లో రెండు నెలల పాటు ఎయిడ్స్‌పై ప్రచారం, అవగాహన సదస్సులు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ఎవరికైనా హెచ్ఐవీ నిర్ధారణ అయితే ఏఆర్టీ మందులు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా జీవితకాలం పాటు అందిస్తారన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల సమగ్ర సమాచారాన్ని తెలుసుకునేందుకు నేషనల్ టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ 1097ను ఏర్పాటు చేశారన్నారు. డీసీహెచ్ఎస్ కార్తీక్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మి, ఎయిడ్స్ నియంత్రణ సూపర్‌వైజర్ బుజ్జిబాబు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

మామిడికుదురు, ఆగస్టు 12: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం ఆయన నగరం హైస్కూలును సందర్శించి స్కూలు అసెంబ్లీ సమయంలో విద్యార్థులతో మాట్లాడారు. ఒక లక్ష్యం ఏర్పాటుచేసుకుని, ఆ లక్ష్య సాధనకు ముందుకు సాగాలన్నారు. హెచ్ఎం విజయకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌలు చట్ట సవరణకు ఉత్తర్వులివ్వాలి

రాజోలు, ఆగస్టు 12:గత ప్రభుత్వం కౌలు చట్టానికి సవరణలుచేసి భూయజమాని అనుమతితోనే కౌలుకార్డులు జారీ చేయాలనే నిబంధన పెట్టడం వల్ల కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆ నిబంధన తొలగించడానికి ఉత్తర్వులివ్వాలని బీఎస్పీ రాజోలు నియోజకవర్గ అధ్యక్షుడు ఆకుమర్తి భూషణం ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. వేగివారిపాలెంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

యానాంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

యానాం, ఆగస్టు 12: స్వాతంత్ర్య వేడుకలు పురస్కరించుకుని యానాం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో జెండా ఊపీ ర్యాలీని ఎస్పీ రాజశేఖరన్ ప్రారంభించారు. తొలుత సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు

మండల సమావేశంలో సర్పంచ్‌ల ఆవేదన


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కోలా గంగాభవానీ

ముమ్మిడివరం, ఆగస్టు 12: గ్రామాల్లో తాగునీరు సక్రమంగా అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు, జలజీవన్ మిషన్‌లో చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయని మండల పరిషత్ సమావేశంలో పలువురు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ముమ్మిడివరం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ కోలా గంగాభవానీ అధ్యక్షతన సోమవారం మండల పరిషత్ సమావేశం జరిగింది. సమావేశంలో తాగునీటి విభాగానికి సంబంధించి ఏఈ నానాజీ మాట్లాడుతూ జలజీవన్ మిషన్‌లో అన్నంపల్లి, కొమానపల్లి, కొత్తలంక గ్రామాల్లో తాగునీటి కుళాయిలు వేయాల్సి ఉందని, అనాతవరం, క్రాప చింతలపూడి గ్రామాల్లో జలజీవన్ మిషన్ మూడో విడత పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. దీనిపై అయినాపురం గ్రామ సర్పంచ్ మోకా రామారావు మాట్లాడుతూ జలజీవన్ మిషన్‌లో పైపులైన్లు వేసినా భూగర్భ జలాలు కలుషితం కావడంతో వాటిలో నుంచి మంచినీరు మాత్రం రావడంలేదన్నారు. తాగునీటి సమస్య మండల పరిషత్ సమావేశం దృష్టికి తీసుకువచ్చినా సమస్య పరిష్కారం కాలేదని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మట్టపర్తి సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. అనాతవరంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ మిమ్మితి చిరంజీవి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. జలజీవన్ మిషన్ పనులపై గ్రామాల్లో సర్వే జరుగుతుందని, ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎంపీడీవో కేవీ నరసింహారావు పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ కొత్తలంక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ముకుంద మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటుచేస్తున్న మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. ఎంఈవో బొజ్జా రమణశ్రీ మాట్లాడుతూ మండలంలో 79పాఠశాలల్లో 42,038మంది విద్యార్థులకు కిట్లు అందించామన్నారు. గృహనిర్మాణశాఖ ఏఈ వేణు మాట్లాడుతూ మండలంలో 14లేఅవుట్లలో 315 ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి 149పూర్తయ్యాయని, మరో 166వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఎలక్ట్రికల్ ఏఈ శివాజీ మాట్లాడుతూ ఆ శాఖ తరుపున చేపట్టిన పనులు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కందిపప్పు సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో విమల రెవెన్యూ అధికారులను కోరారు. ఉపాధిహామీ పథకంలో ఉద్యాన పంటలకు అవకాశం ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో వెంకటేశ్వరరావువివరించారు. పంచాయతీరాజ్ డీఈ పీవీ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయాల్లో భవనాల నిర్మాణాలు, ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనుల వివరాలను వివరించారు. వ్యవసాయ అధికారి ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ రబీసీజన్‌లో 4932ఎకరాల్లో రైతులు వరినాట్లు వేశారన్నారు. జడ్పీటీసీ కుడుపూడి శంకరరావు, ఎంపీడీవో కేవీ నరసింహారావు, తహసీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పని సర్దుబాటును బహిష్కరించిన ఫ్యాప్టో


ఉపాధ్యాయుల సర్దుబాటును నిరసిస్తున్న ఫ్యాప్టో జిల్లాసంఘ నాయకులు

అమలాపురంటౌన్, ఆగస్టు 12: జిల్లాలోని వివిధపాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులుగా ఉన్నవారిని సర్దుబాటు చేస్తూ అవసరమైన పాఠశాలలకు కేటాయించే పేరుతో తలపెట్టిన పని సర్దుబాటును ఫ్యాప్టో జిల్లాశాఖ బహిష్కరిస్తున్నట్టు సోమవారం ప్రకటించింది. పనిసర్దుబాటుకు సంబంధించి ఉపాధ్యాయ సంఘాల సూచనలు పరిగణలోనికి తీసుకోవాలని, రిటైర్ అయ్యే ఉపాధ్యాయులను, ఖాళీ పోస్టులను పరిగణలోకి తీసుకుని సహేతుకమైన జాబితాలను తయారుచేసి ఉపాధ్యాయుల సర్దుబాటును సావధానంగా నిర్వహించాలని ఫ్యాప్టో తరఫున ఎస్టీయూ, యూటీఎఫ్, జీహెచ్ఎం జిల్లా నాయకులు నాగిరెడ్డి శివప్రసాద్, పోతంశెట్టి దొరబాబు, సరిదే సత్యపల్లంరాజు, పెంకే వెంకటేశ్వరరావు, నారాయణ శ్రీనివాసరావు, నిమ్మకాయల గణేశ్వరరావు డిమాండ్ చేశారు.

అసంబద్ధ సర్దుబాటును నిలిపివేయాలి

రాయవరం, ఆగస్టు 12: ఉపాధ్యాయుల అసంబద్ధ సర్దుబాటును ప్రభుత్వం నిలిపివేయాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు దేవరకొండ సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్టీయూ నాయకులు సోమవారం ఎంఈవోలకు వినతిపత్రాలు అందజేశారు. పంపన వీరవెంకటరమణ, నల్లమిల్లి భాస్కరరెడ్డి, జి.మురళి, యాకల విశ్వేశ్వరరావు, గుంటూరు అప్పారావు, ఎస్ఏ రెహ్మాన్, వి.సాయన్నపాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 12: ఉపాధ్యాయుల అసంబద్ధ పని సర్దుబాటును సోమవారం పట్టణం, మండలంలో ఉపాధ్యాయులు బహిష్కరించారు. జీవో 117ను రదు చేయాలని, అసంబద్ధ విధానాలు రద్దుచేయాలని డీవైఈవో, ఎంఈవో కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు. ఫ్యాప్టో పట్టణ నాయకులు రాయుడు శ్రీనివాస్. డి.వి.వి.సత్యనారాయణ, కాదా శ్రీరాములు, గరగ ఈశ్వరరావు, పి.ఎస్.వి.రమణ, కట్టా శ్రీనివాస్, డి.వీరేంద్రబాబు, కె.వి.వి.సత్యనారాయణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

ఆత్రేయపురం, ఆగస్టు12: సోమవారం మండలంలో ఉపాధ్యాయులు విధులను బహిష్కరించి ఎంఈవో ప్రసాదరావుకు వినతిపత్రాన్ని అందచేశారు. జీవో నెం 117ను తక్షణమే రద్దు చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు రామకృష్ణ, సుధాకర్‌బాబు, మాణిక్యాలరావు, దొరబాబు, వెంకట్రాజు, ప్రసాద్, శ్యామ్‌బాబు పాల్గొన్నారు.

మంత్రి నాదెండ్లకు కొత్తపేటలో ఘన స్వాగతం



కొత్తపేట, ఆగస్టు 12: జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం కొత్తపేటకు విచ్చేసిన పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు స్థానిక కాపు కల్యాణ మండపం వద్ద ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా మనోహర్‌ను సత్కరించారు. మనోహర్‌కు స్థానిక నాయకులు అభినందనలు తెలిపారు. అలాగే జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ పుష్పగుచ్ఛం అందించారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, గిడ్డి సత్యనారాయణ, దేవ వరప్రసాద్, స్థానిక నాయకులు కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మిభాస్కరరావు, ధర్నాల రామకృష్ణ, కేవీ సత్యనారాయణరెడ్డి, గుత్తుల పట్టాభి, చిలువూరి సతీష్‌రాజు, యల్లమల్లి జగన్మోహన్, బండారు వీరబాబు, త్సమా బాబు, పప్పుల కొత్తయ్య, చింతం కృష్ణ, బండారు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: జిల్లా పర్యటనకు విచ్చేసిన మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఈతకోట జాతీయ రహదారి సెంటర్ వద్ద ఘనస్వాగతం లభించింది. కొత్తపేట నియోజవవర్గ జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు ఆయనకు స్వాగతం పలికారు. జాతీయ రహదారి చెంతనే ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు తోట స్వామి, బండారు బాబి, యర్రంశెట్టి రాము, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

అంబాజీపేట: అమలాపురం వెళ్తున్న మంత్రి మనోహర్‌కు ముక్కామల లాకుల వద్ద జనసేన, టీడీపీ నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కొర్లపాటి గోపి, సుంకర బాలాజీ, అరిగెల సూరిబాబు స్వాగతం పలికారు.

కేశవరంలో ట్రాఫిక్ జామ్

మండపేట, ఆగస్టు 12: కేశవరంలో సోమవారం సాయంత్రం కెనాల్ రోడ్డులో బస్సు, లారీ ఢీకొన్నాయి. దీంతో కెనాల్ రోడ్డులో కడియం, ద్వారపూడి మధ్య వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మండపేట రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: భవనమ్
శ్రీలలిత	: కమిటీ కుర్రోళ్లు
శేఖర్ స్క్రీన్-1	: తుఫాన్
శేఖర్ స్క్రీన్-2	: బడ్డీ
రమా	: రాయన్
గణపతి	: సూపర్ డీలక్స్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కల్కి
వెంకటపద్మావతి స్క్రీన్-2	: సింబా

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసన



నిరసనలో పాల్గొన్న అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అమలాపురం టౌన్, ఆగస్టు 12: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అమానుష దాడులను నిరసిస్తూ అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. చైతన్యవేదిక కన్వీనర్ యల్లమిల్లి నాగసుధాకొండలరావు ఆధ్వర్యంలో జరిగిన నిరసన సభలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర నాయకుడు ఓలేటి సత్యనారాయణ మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో హిందువులకు మనోధైర్యం కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మానవహారం నిర్వహించి దాడుల్లో మృతిచెందిన హిందువులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్, నాయకులు బులుసు జగదీష్, ఉప్పుగంటి భాస్కరరావు, పోలిశెట్టి అనంతలక్ష్మీదేవి, శిరంగు నాయుడు, పుత్సా కృష్ణకామేశ్వర్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 12: రామచంద్రపురంలోని 132కేవీ సబ్‌స్టేషన్‌లో పరికరాలు మార్పు నేపథ్యంలో ముమ్మిడివరం, కొత్తపేట, అమలాపురం, రాజోలు పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ ఖాజా రహతుల్లా, ఏపీఈపీడీసీఎల్ ఈఈ విజయానంద్ తెలిపారు.

పి.గన్నవరం: నరేంద్రపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కోసం మంగళవారం ఉదయం8నుంచి మధ్యాహ్నం2గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. నరేంద్రపురం, రాజులపాలెం, కుందాలపల్లి, ఉడిమూడి, బెల్లంపూడి, యర్రంశెట్టివారిపాలెం, గంటిపెదపూడి గ్రామాలతో పాటు పశ్చిమగోదావరి జిల్లా పెదమల్లంక, అంబాజీపేట మండలం ఇసుకపూడి గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన నాథ్‌బాబు



పి.గన్నవరం, ఆగస్టు 12: మానవవనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌ను ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో సోమవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరును నిర్ణయించడంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, లోకేశ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న రహదారులను అభివృద్ధి చేయాలని లోకేష్‌ను ఆయన కోరారు.

చవితి ఉత్సవాలకు ఆంక్షలు సడలించాలి

అమలాపురం టౌన్, ఆగస్టు 12: దేశంలో ఎక్కడా లేని విధంగా గణపతి నవరాత్రి ఉత్సవాలకు గత వైసీపీ ప్రభుత్వం ఎన్నో ఆంక్షలు విధించిందని, కూటమి ప్రభుత్వం ఆ ఆంక్షలను సడలించి ప్రజలు ఆనందోత్సాహాలతో చవితి ఉత్సవాలు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని శృంగవృక్షం శ్రీదత్తపీఠం పీఠాధిపతి సాయిదత్త నాగానంద సరస్వతీస్వామీజీ పేర్కొన్నారు.అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. వీహెచ్‌పీ కేంద్ర కమిటీ సభ్యుడైన నాగానంద సరస్వతీస్వామిజీ మాట్లాడారు. వీహెచ్‌పీ జిల్లాశాఖ అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో శిరంగు నాయుడు, గొవ్వాల నాగరాజు, సలాది సాయిరామ్, గొవ్వాల అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం వద్ద పీడీఎస్‌యూ ధర్నా

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు12: రామచంద్రపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను తరలించవద్దని, నూతన భవనాలు నిర్మాణం పూర్తి చేయాలని డిమాండు చేస్తూ సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేశారు. ఈసందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దూ మాట్లాడారు. తొలుత పాలిటెక్నిక్ కళాశాల నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శన జరిపారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ నాయకులు కె.నవీన్‌కుమార్, సాయిరాం, డి.ఆదిత్య, బి.తేజసాయిరాం, పి.తేజ, బీమేష్, మౌనిక, భార్గవి, హర్షిణి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, క్రీడా పోటీలు

కె.గంగవరం, ఆగస్టు 12: స్వాతంత్ర్య వేడుకలు పురస్కరించుకుని వారధి ట్రస్టు ఆధ్వర్యంలో పది ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు స్వాతంత్ర్య వేడుకల్లో బహుమతులు అందిస్తామని ఎంఈవో ఏ.నాగరాజు చెప్పారు. కె.గంగవరం ఉన్నతపాఠశాలలో పీడీ శ్రావణి పర్యవేక్షణలో ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వ హించారు. హెచ్ఎం పి.వెంకటేశ్వరరావు, పి.వి.బ్రహ్మానం దం, కె.వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పి.గన్నవరంలో అన్నక్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలి

పి.గన్నవరం, ఆగస్టు 12: నియోజకవర్గ కేంద్రం పి.గన్నవరంలో అన్నక్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు కోరారు. ఉండవల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో మానవవనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందించినట్టు తెలిపారు. రెండో దశలో పి.గన్నవరంలో అన్నక్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని లోకేశ్ హామీ ఇచ్చారని నామన తెలిపారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను కలిసి అన్న క్యాంటీన్ ఏర్పాటుపై వివరించినట్లు ఆయన తెలిపారు.

సోషలిస్టు వ్యవస్థలోనే సమాన అవకాశాలు

మలికిపురం, ఆగస్టు 12: సోషలిస్టు వ్యవస్థలోనే సమాన అవకాశాలు లభిస్తాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బెల్లంకొండ బుచ్చిబాబు అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మలికిపురం డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఫ్యాక్టరీని ప్రైవేటు పరం చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను విమర్శించారు. దేవ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎంవీ సత్యనారాయణమూర్తి, ప్రిన్సిపాల్స్ శ్రీసుధ, సతీష్, రాంబాబు, భూపతి అజయ్‌కుమార్, పోలిశెట్టి గణేష్, తాడి రవీంద్రపాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన ఏర్పరుచుకోవాలి

ముమ్మిడివరం, ఆగస్టు 12: ప్రభుత్వ పథకాలపై ప్రతీ ఒక్కరూ కనీస అవగాహన ఏర్పరుచుకోవాలని ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీలో సోమవారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, రామాయణం మనేశ్వరరావు, పీవీ చక్రవర్తి, పోలీసు, మున్సిపల్ అధికారులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పడవలను నడపాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

అల్లవరం, ఆగస్టు 12: ఓడలరేవు, బెండమూర్లంక రేవుల్లో పడవల రాకపోకలను కొనసాగించాలని బీవీసీ విద్యార్థులు కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. వరదల కారణంగా రేవుల రాకపోకలు నిషేధం ఉంచడం వల్ల 10 కిలోమీటర్ల ప్రయణానికి అదనంగా సుమారు 70 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. పడవల రాకపోకలు కొనసాగించాలని కోరారు.

అత్త,మామల వేధింపులపై వివాహిత ఫిర్యాదు

అంబాజీపేట, ఆగస్టు 12: భర్త, అత్తమామలు, కుటుంబ సభ్యులు మానసికంగా చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఒక మహిళ అంబాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గంగలకుర్రు అగ్రహారం గ్రామానికి చెందిన కాళ్ళకూరి నాగలక్ష్మిసుధారాణికి, అన్నవరానికి చెందిన దాసరి లక్ష్మణ్‌తో 2014లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొన్నిసంవత్సరాల నుంచి భర్త లక్ష్మణతో పాటు మావయ్య, అత్త, కుటుంబ సభ్యులు చిత్రహింసలకు గురిచేస్తున్నారని, ఇటీవల తన భర్త రెండో పెళ్లి చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని, మామయ్య తనను లైగింకంగా వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

మలికిపురం, ఆగస్టు 12: మలికిపురానికి చెందిన పడమటి జార్జినోయల్(19) రెండు రోజుల నుంచి కనిపించడంలేదని తండ్రి రత్నరాజు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు. తనకు పరిచయం ఉన్న యువతితో ఘర్షణ పడి ఈనెల9వ తేదీ రాత్రి మోటారు సైకిల్‌ను చించినాడ బ్రిడ్జి వద్ద వదిలి వెళ్లాడన్నారు. అతడి ఆచూకీ తెలిసినవారు మలికిపురం పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

చెట్టును ఢీకొట్టిన కారు

అంబాజీపేట, ఆగస్టు 12: నందంపూడి వంతెన సమీపంలో సోమవారం ఒక కారు కొబ్బరిచెట్టును ఢీకొట్టింది. పిగన్నవరం మండలం గంటిలో జరిగిన శుభకార్యానికి వెళ్లి గుడాల తిరిగి వస్తుండగా కారు అదుపుతప్పి కొబ్బరిచెట్టును ఢీకొట్టింది. కారులో ఉన్న ఏడుగురికి స్వల్పగాయాలయ్యాయి.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు

మలికిపురం,ఆగస్టు12: గుడిమెళ్లంకలో గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను సోమవారం అరెస్టుచేసినట్టు ఎస్ఐ డి.సురేష్ తెలిపారు. కోర్టు రిమాండ్ విధించిందన్నారు. గంజాయి అమ్మినా, సేవించినా చర్యలు తప్పవన్నారు.